రక్తంకన్న స్వేద మెక్కువగపారే శ్రమకర్మల
కదనానికి
ఈలోపు లేటు ఉన్నది. బ్రతుకు ధరలు పడి
పోయినవి విపణి వీథి
వినిమయాల బ్యాంకుల సప్త మహా సౌధదేహాలపై
ఉక్కుల నిద్దురలో ఒక హాయి ఉన్నది.
వెలుగుకోరకు వగపెందుకు, సూచి భేద్యా మేచక
శైవలావృత మీ నిశాకాల కాసారం
మన దగ దీర్చకపోదు, రిక్తబోదు దివాంధాల
దుష్కర కృష్ణాభిసారం
కాటుక కొండల కవల ప్రొద్దుందని అనేవారు,
నిజంకాని నిజమొక్కటి చెబుతున్నారు
ప్రొద్దున్నది కాటుకకొండల క్రింద గనుక ముందు
పెకలించాలి కాటుక కొండల బారు
ప్రొద్దును సృష్టించాలి ఒక్కొక్క వ్యాప్స ఎందన
మిచ్చి ఒక్కొక్క కిరణసూత్రం చేర్చి
మానవ నైరాశ్యాల కరుడుగట్టిన నెత్తుటికూడు
ఒక్కొక్క ముద్ద కూర్చి, చేర్చి
ప్రత్యూషాల చిర సనాతన గమ్యానికి సాగే
పయన మాగిపోదు
విశ్వావన గంగోత్తుంగ తరంగాళి హారుని జటా
జూటంలో దాగిపోదు
వేకువ కనుమతించాలని మనం చేసిన తీర్మానం
వీగిపోదు
కాని ఒకే ఒక్క దువిధ- పులుగులు ఎలుగులెత్తి
నపుడు లేలకు అలవాటుబడిన
వారంతా ఏమౌతారు, రేయల్లా మేలుకొని అలసిన
కనులు తమంతటను మూతబడిన
పవలు కూడ రేయి కాదా? వేరేదీ త్రోవ లేదా?

---

గల్పిక

# "ఆవారా" బుష్‌కోటు

నిడదవోలు మాలతి

"ఏం కావాలమ్మా!" అన్నాడు గుమాస్తా సన్నటి పొడుగావిడ లోపలికి రాగానే. ఆవిడ వెనకే అవారా బుష్‌కోటు వేసుకున్న పధ్నాలగేళ్ళ అబ్బాయి లోపలికొచ్చాడు.

"మైసూరు సిల్కు సారీస్ ఉన్నాయా?"

"ఉన్నాయండీ"

"ప్స్. కలర్సేం బాగులేవు. లైట్ గ్రీన్ కలర్ లేదూ?"

"లేదండీ. బెంగుళూరు సిల్కు అయితే ఉందండీ."

"వద్దులే. ఆ బ్లూ సారీ తియ్యి చూద్దాం."

"బిల్లుచీరండీ. ఇరవై ఎనిమిది రూపాయలు."

"సెవన్ యార్డ్సేనా?"

"టూ కాట్ట్" అన్నాడు అవారా బుష్‌కోటు మధ్యలో కలుగజేసుకుని. ఆవిడ అతనివేపు అదోలా చూసి, గుమాస్తాతో జాకెట్ పీసెస్ తియ్యమంది. ఓ పదిరకాలు తీసి పైవరుడేశాడు గుమాస్తా. అదికాదని ఇది, ఇదికాదని అది అన్నీ లాగిస్తూంటే గుమాస్తాకి లేని తలనొప్పి పుట్టుకొస్తోంది. మధ్యమధ్యలో అవారా బుష్‌కోటు కలుగజేసుకుంటూనే ఉన్నాడు. ఆవిడ అతనివేపు అదోలా చూస్తూనే ఉంది. ఇదిమాత్రం గుమాస్తా గమనించనేలేదు. పాపంతా మూడుమాట్లు తిరగేయించి 34-14-0 బిల్లు చేసింది. గుమాస్తా "అమ్మయ్య" అనుకున్నాడు.

"హండ్రెడ్ రూపీస్ ఛేంజి ఉందా?" అంది పర్సుచూస్తూ. లేదన్నాడు మేనేజరు.

"అయితే విడిగా 50-0-0 ఉన్నాయి ఇవి తీసుకోండి. అటు వెళ్ళి మళ్ళీవచ్చేటప్పుడు మిగిలింది యిచ్చేస్తాను. ఈ పేకెట్ కూడా ఇక్కడే ఉంచండి" అందావిడ. వెనకే "ఆవారాహూం" అని పాడుతూ ఆ అబ్బాయి కూడా వెళ్ళిపోయాడు.

మరో రెండునిముషాలు అయినా అవకముందే ఆవారా బుష్‌కోటువచ్చి అయిదు రూపాయలిచ్చి పార్సెలూ, బేడా తీసుకెళ్ళిపోయాడు.

మరో రెండునిముషాలు అయినా అవకముందే సన్నటి పొడుగావిడవచ్చి పార్సెలడిగేసరికి షాపు కీపర్ తెల్లబోతూ, "ఇప్పుడే మీ అబ్బాయి పట్టుకెళ్ళాడు కదండీ?" అన్నాడు.

"మా అబ్బాయెవరూ?" అందావిడ అంతకన్న వింతగా.